ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ సభ్యులు (ఫైల్)

షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు

న్యాక్ బీ ప్లస్

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 8 : షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ బీ ప్లస్ గ్రేడింగ్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.కమల గురువారం తెలిపారు. గత నెల 30, 31న షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్(నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కమిటీ) సభ్యులు సందర్శించారని ఆమె తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల ప్రవేశాలు, తరగతి గదులు, ఫర్నిచర్, కళాశాల నిర్వహణ, విద్యా బోధన విధానం, సాంస్కృతిక కార్యక్రమాలు, రికార్డులను పొందుపరచడం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌లు, విద్యార్థులకు మౌలిక వసతులు, సోలార్ విద్యుత్ వంటి వాటితో కళాశాలకు బీ ప్లస్ వచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ శ్రీలత మాట్లాడుతూ.. కళాశాల బృందం చేసిన ఉమ్మడి ప్రయత్నంతోనే ఈ గ్రేడ్‌ను సాధించినట్లు, జాతీయస్థాయిలో సాధించిన గ్రేడింగ్‌తో ఈ కళాశాలలో మరింత అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పడంతో పాటు యూజీసీ నిధులు సాధించడానికి వీలుంటుందన్నారు. కళాశాలకు బీ ప్లస్ గ్రేడింగ్ రావడంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వెల్లడిస్తున్న డీసీపీ వినీత్

డ్రగ్స్ విక్రయదారులపై..

సైబరాబాద్‌లో డేగ కన్ను

ఇద్దరు అరెస్టు.. రూ. 8 లక్షల డ్రగ్స్ స్వాధీనం

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 8: డ్రగ్స్ విక్రయదారులపై సైబరాబాద్ పోలీసులు డేగ కన్ను పెట్టారు. కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల విక్రయంతో పాటు వినియోగంపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. డ్రగ్స్ విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా టీ-న్యాబ్ వ్యవస్థ పనిచేస్తుండగా.. సైబరాబాద్‌లో ఎస్ఓటీ పోలీసులు సైతం మత్తు మాఫియాకు అడ్డుకట్టవేస్తున్నారు. ఈ క్రమంలోనే పబ్బులకు వచ్చేవారిని లక్ష్యంగా చేసుకొని డ్రగ్స్‌ను విక్రయిస్తున్న ఇద్దరిని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8 లక్షల విలువైన 21.788 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 874.316 గ్రాముల గంజాయితోపాటు మారుతీ సియాజ్ కారు, 2 సెల్‌ఫోన్లు, 2 డిజిటల్ వెయింగ్ మిషన్లు స్వాధీనం చేసుకున్నారు.

గురువారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వినీత్ కేసు పూర్వాపరాలను వెల్లడించారు. కొండాపూర్‌కు చెందిన మారం పవన్‌కుమార్ అలియాస్ మచ్చ పవన్(31), జొమోటో డెలివరీ బాయ్ ఆదర్శ్ కుమార్ సింగ్(21) డ్రగ్స్ దందా చేస్తున్నారు. కొంతకాలంగా వీరు కొండాపూర్ శిల్పాపార్కు కాలనీ ప్రధాన రహదారి సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్ఓటీ, లా లాండ్ ఆర్డర్ పోలీసులు గురువారం దాడి చేశారు. నిందితులు పవన్‌కుమార్, ఆదర్శ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని, సోదాలు నిర్వహించారు. వారి నుంచి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరూ ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు డ్రగ్స్ కొనుగోలు చేసి.. ఆ డ్రగ్స్‌ను ఎక్కువ ధరకు నగరంలో విక్రయిస్తున్నారు. నిందితులిద్దరూ నగరంలో ఎవరెవరికీ డ్రగ్స్ విక్రయిస్తున్నారు.. వారు ఎక్కడున్నారు.. అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వారిని కూడా గుర్తించి త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ తెలిపారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

నగరంలో పబ్స్‌కు వెళ్లే యువతను లక్ష్యంగా చేసుకొని కొందరు డ్రగ్స్ విక్రయిస్తున్నారని, వారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని మాదాపూర్ డీసీపీ వినీత్ అన్నారు. డ్రగ్స్, గంజాయి ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వారి సమాచారం పోలీసులకు ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డయల్ 100, యాంటి డ్రగ్స్ అభ్యూస్ హెల్ప్‌లైన్ 9492099100, ఎన్‌డీపీఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్ 7901105423, సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 9490617444లలో సంప్రదించాలని సూచించారు. డ్రగ్స్ అలవాటు ఉన్నవాళ్లు సైతం తమను సంప్రదిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి.. వారికి సరైన యాంటీ డ్రగ్స్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ ఫ్రీ సొసైటీగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో - గాంధీ బుణాకర్ మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనల్లో గురువారం పలువురు కళాకారులు ఆకట్టుకున్నారు. - కొండాపూర్, ఫిబ్రవరి 8

అసెంబ్లీ సమావేశాలు..

విద్యార్థి నాయకుల అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8 : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో పోలీసులు ముందస్తు అరెస్టులకు తెరలేపారు. జీవో 46ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థులను హాస్టళ్ల నుంచి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. అరెస్టులతో విద్యార్థుల గొంతులను నొక్కలేరన్నారు. ఎన్ని అరెస్టులకైనా సిద్ధంగా ఉండి.. జీవో రద్దు చేసే వరకు ఉద్యమాన్ని ఆపబోమన్నారు. ఎన్నికలకు ముందు జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చి, గద్దెనెక్కిన తరువాత దాని గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. ఒడ్డు చేరే వరకు ఓడ మల్లన్న, చేరిన తరువాత బోడ మల్లన్న అన్నట్లుగా రేవంత్ ప్రభుత్వ వైఖరి ఉన్నదని దుయ్యబట్టారు.

విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

విద్యార్థినికి లైంగిక వేధింపులు

- నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థిని తల్లిదండ్రులు
- ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింపు

ఆదిబట్ల, ఫిబ్రవరి 8 : నాదర్‌గుల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో దారుణం జరిగింది. విద్యా బుద్ధులు నేర్పాల్సిన గురువే కీచకుడిగా మారాడు. నెల రోజులుగా ఆ విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురిచేయడంతో విద్యార్థిని తల్లిదండ్రులు గురువారం ఆ ఉపాధ్యాయుడిపై ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఓ విద్యార్థిని 8వ తరగతి చదువుతున్నది. అదే పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న ప్రకాశ్ ఆమెపై కన్నేశాడు. నెల రోజులుగా లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు ఈ వ్యవహారాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకుపోగా.. ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రకాశ్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

పెరుగుతున్న రౌడీల ఆగడాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రౌడీ షీటర్లను ఉక్కుపాదంతో అణచివేసేందుకు పోలీసు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. బుద్ధి మార్చుకోవాలంటూ ఎన్నిసార్లు కౌన్సెలింగ్ చేసినా.. రౌడీల తీరు మారడం లేదు. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నెలలో జరిగిన కొన్ని నేరాల్లో రౌడీషీటర్ల పాత్ర ఉంది. సామాన్యులను హత మార్చడం, రౌడీషీటర్ల మధ్య అధిపత్య పోరాటం, పాత కక్షలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో దాదాపు 1950 రౌడీషీటర్లు ఉన్నారు. ఇందులో సగానికి పైగా రౌడీయిజానికి దూరంగా ఉన్నా.. మిగతావారు మాత్రం రౌడీయిజాన్ని కొనసాగిస్తూ నేరాలు చేస్తున్నారు. నగర పీసీ రౌడీషీటర్ల తీరు మార్చుకోవాలంటూ కౌన్సెలింగ్ నిర్వహిస్తూ.. నేరాల బాట వదిలేయాలంటూ హెచ్చరించారు. మరో పక్క మిగతా కమిషనర్లు కూడా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించడం వంటి కార్యక్రమాలతో రౌడీయిజాన్ని అదుపులో పెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో కొరవడిన నిఘా

క్షేత్ర స్థాయిలో మాత్రం రౌడీషీటర్లపై నిఘా కొరవడింది. రౌడీషీటర్లు ఏమి చేస్తున్నారు.. ఎక్కడుంటున్నారు.. అనే విషయంపై గతంలో క్షేత్ర స్థాయిలో నిఘా ఉండేది. ఇటీవల క్షేత్ర స్థాయి నిఘా కొరవడింది. ఉన్నతాధికారులు అప్పుడప్పుడు తీసుకుంటున్న చర్యలు కూడా ఫలితాల నివ్వడంలేదు. తాజాగా.. బుధవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బీజేపీ నాయకుడిని హనీ ట్రాప్ చేసి, ఒక అపార్ట్‌మెంట్ వద్దకు రప్పించి అతడిపై విచక్షణ రహితంగా కత్తులతో దాడి చేసి, మర్మాంగాలు కోసి కిరాతంగా హతమార్చారు. ఈ అగంతకుల ముఠాలో రౌడీషీటర్లు కూడా ఉన్నట్లు సమాచారం.

ప్రతీకార దాడులు..

ఒక రౌడీషీటర్ హత్యకు గురయ్యాడంటే దానికి ప్రతీకారం తీర్చుకోవడం కోసం మరో గ్యాంగ్ ఎత్తులు వేస్తుంటుంది. ఇందులో భాగంగా రోజులు, నెలల తరబడి ఎదురు చూస్తూ అవకాశం చిక్కగానే తమ పగను తీర్చుకుంటున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్ పరిధిలో నెలలో ఒక రౌడీషీటర్‌కు సంబంధించిన హత్య వెలుగులోకి వస్తుంది. గత నెలలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్‌లో ఒక రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. అలాగే, కొన్ని రోజుల వ్యవధిలోనే పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో మయన్మార్‌కు చెందిన శరణార్థి రౌడీషీటర్ చేతిలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో రేషన్ బియ్యం అక్రమ దందా విషయంలో వచ్చిన విభేదాలతో ఒక వ్యక్తిని రౌడీషీటర్లతో కలిసి ఒక ముఠా హత మార్చింది. కాలాపత్తార్‌లో మహ్మద్ అసద్ అనే రౌడీషీటర్, మరో ఇద్దరితో కలిసి మరో రౌడీషీటర్ అశ్వాక్‌ను హత్య చేసేందుకు కుట్ర చేసి.. పోలీసులకు దొరికిపోయాడు. ఇలాంటి ఘటనలతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రౌడీషీటర్లపై క్షేత్ర స్థాయిలో నిఘా కొరవడటం కూడా రౌడీషీటర్లు రెచ్చిపోవడానికి ఒక కారణమనే వాదన వినిపిస్తున్నది. రౌడీషీటర్లపై మరింత నిఘాను కొనసాగిస్తూ, కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నదని ప్రజలు కోరుతున్నారు.

తమ్ముడి చేతిలో అన్న హత్య

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 8: సొంత అన్నను గొంతుకోసి తమ్ముడు హత్య చేశాడు. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.మధు కథనం ప్రకారం.. శాస్త్రీపురం ప్రాంతానికి చెందిన రహీం(40), ఇస్మాయిల్ సోదరులు. రహీంకు మతిస్థిమితం సరిగా లేదు. తరచూ రోడ్లపై తిరుగుతూ.. అందరితో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇస్మాయిల్‌పై కూడా దాడి చేశాడు. బుధవారం రాత్రి జరిగిన దాడితో కోపం పెంచుకున్న ఇస్మాయిల్.. గురువారం ఉదయం కత్తితో అన్న రహీం గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం నిందితుడు ఇస్మాయిల్ మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు, క్లూస్ టీమ్ వివరాలు సేకరించాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ స్టంట్స్ చేస్తున్న యువకుల అరెస్టు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 8: రహదారులపై ప్రమాదకరంగా బైక్‌స్టంట్స్ చేస్తున్న ఆరుగురు బైక్ రైడర్లను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. హైటెక్‌సిటీ నాలెడ్జి సిటీలో టీ-హబ్ రహదారిపై గురువారం తెల్లవారుజామున బైక్ స్టంట్స్ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్రమాదకరంగా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ఇతరులకు ఇబ్బంది కలిగేలా వాహనాలు నడుపుతున్నారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సోటీ పోలీసులు లంగర్‌హౌజ్ ప్రాంతానికి చెందిన షేక్ సల్మాన్(21), అప్రోజ్‌ఖాన్ (20), మహ్మద్ సోహైల్(20), మీర్ సోహెల్ (20), ఇమ్రాన్‌ఖాన్(21), ఇమ్రాన్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. వారి నుంచి మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురుని అరెస్టు చేసిన రాయదుర్గం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

మైలార్‌దేవపల్లి, ఫిబ్రవరి 8: కార్మికులు తమ హక్కులను సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, క్లస్టర్ కన్వీనర్ జాజాల రుద్రకుమార్ అన్నారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో పలు పరిశ్రమలలో సమ్మె నోటీసులు అందజేశారు. కాటేదాన్‌లోని శ్రీనాథ్ రోడ్డు ప్యాక్, పీపీఎల్‌తో పాటు పలు పరిశ్రమల్లో సమ్మె నోటీసులను పరిశ్రమల యజమానులకు అందించారు. ఫిబ్రవరి 16న కార్మికుల హక్కుల కోసం సమ్మె చేపట్టడం జరుగుతుందన్నారు.

మహిళా సంఘాలకు అండగా నిలుస్తా..



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌పీలు

మియాపూర్, ఫిబ్రవరి 8 : మహిళల ఆర్థికాభివృద్ధిలో కీలకమైన మహిళా సంఘాలకు తాను ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. మహిళలను పొదుపు దిశగా మరింతగా చైతన్యపరచాలని సూచించారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని మహిళా సమాఖ్య సంఘాల ఆర్‌పీలు ఎమ్మెల్యే గాంధీని గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని.. ప్రభుత్వ పరంగా వారికి అందాల్సిన వసతులను సైతం కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు పాల్గొన్నారు.

వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్ వీకర్ సెక్షన్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంఘాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కాలనీ అభివృద్ధికి తన పూర్తి తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ దేవాలయ వార్షికోత్సవం

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్ ఖాయిదామ్మ కుంట చెరువు కట్ట వద్ద గల మైసమ్మ దేవాలయంలో 9వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ విచ్చేసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హఫీజ్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గ ఓటర్లు 7,47,671

మియాపూర్, ఫిబ్రవరి 8 : త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటర్ల జాబితాను గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రదర్శించారు. నియోజకవర్గంలో మొత్తం 7,47,671 నిర్ధారణ అయ్యారు. పురుషులు 395460, మహిళలు 3,52,067 ఓటర్లు కాగా 144 ఇతర ఓటర్లున్నారు. నియోజకవర్గంలోని 622 పోలింగ్ బూత్‌లలో తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. కాగా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. తాజా నమోదుతో నియోజకవర్గ వ్యాప్తంగా 15,000 మంది కొత్త ఓటర్లు పెరిగారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించినట్లు ఈఆర్‌వో రజనీకాంత్‌రెడ్డి, ఏఈఆర్‌వో వంశీకృష్ణ తెలిపారు.

వినికిడి సమస్యకు కోక్లియర్ ఇంప్లాంట్‌తో మెరుగైన ఫలితాలు



వినికిడి సమస్య చికిత్స ఫలితాలను వెల్లడిస్తున్న డాక్టర్ సంపూర్ణ ఘోష్

కొండాపూర్, ఫిబ్రవరి 8 : పుట్టుకతో వచ్చే లోతైన లోపంతో బాధపడే చిన్నారులకు కోక్లియర్ ఇంప్లాంట్ చికిత్సతో మెరుగైన ఫలితాలు చేకూరుతాయని మెడికవర్ దవాఖాన ఓటోలారిన్జాలజీ విభాగం వైద్యురాలు డాక్టర్ సంపూర్ణ ఘోష్ అన్నారు. గురువారం దవాఖానలో ఏర్పాటు చేసిన వినికిడి సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు అందించిన చికిత్స, ఫలితాల వివరాలను వెల్లడించారు. గత 6 నెలల్లో 10 మందికి పైగా కోక్లియర్ ఇంప్లాంట్‌లను విజయవంతంగా అమర్చినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి దవాఖాన నామమాత్రపు ఖర్చులతో చికిత్సలను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, చిన్నారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

27 నుంచి సర్టిఫికెట్ కోర్స్ ఇన్

యోగా పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా' పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నామని, పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీ ఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ-ఫార్మసీ మొదటి, మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజు ను ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని అన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహిస్తామని, పరీక్షా తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలి.

పీజీ కోర్సుల చాలెంజ్ వాల్యుయేషన్‌కు..

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే పీజీ కోర్సుల చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ తదితర కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షా ఫలితాలను ఇప్పటి కే విడుదల చేశామని, సందేహాలు ఉన్నవారు ఒక్కో పేపర్‌కు రూ.10,000లు చెల్లించి, ఈ నెల 28లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు కావాలంటే ఒక్కో పేపర్‌కు రూ.1,000 చెల్లించి వచ్చే నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలన్నారు.

ఎఫ్‌టీఎల్ సమస్యలను పరిష్కరిస్తాం

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- లింగోజిగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

లింగోజిగూడ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 8 : లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్కు కాలనీలో ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని లింగోజిగూడ డివిజన్‌లోని గ్రీన్‌పార్కు కాలనీ, శ్రీరాంనగర్ కాలనీలో రూ. 1.27 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల క్రితమే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో సమావేశమై సమస్యలను వివరించామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. శంకుస్థాపన చేసిన వెంటనే అధికారులు పనులను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రావు, డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు, తిలక్‌రావు, రాకేశ్, అశీష్, వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు జగన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మధుసూదన్, అంజయ్య గౌడ్, రాంచందర్ నాయకులు పాల్గొన్నారు.

తేనే టీగల పెంపకంపై 15 నుంచి జాతీయ సదస్సు

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ శర్మ, శిరీష్ కులకర్ణి, రాజేంద్రప్రసాద్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8: శాస్త్రీయ తేనేటీగల పెంపకంపై ఈ నెల 15, 16 తేదీల్లో యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ క్యాంపస్‌లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు నిమ్సమే ఫ్యాకల్టీ మెంబర్ డాక్టర్ శ్రీకాంత్ శర్మ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఫ్యాకల్టీ సభ్యులు డి.శిరీశ్ కులకర్ణి, అసోసియేట్ ఫ్యాకల్టీ సభ్యులు వీబీ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. డాక్టర్ శ్రీకాంత్ శర్మ మాట్లాడుతూ, తేనెటీగల పెంపకం, తేనే ఉత్పత్తి తద్వారా ప్రత్యామ్నాయ జీవనోపాధి తదితర అంశాలపై సదస్సులో చర్చిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తేనేకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. తేనేతో పాటు రాయల్ జెల్లీ, పోలెన్ బాల్స్, వ్యాక్స్, ప్రొపోలీస్, వెనమ్ తదితర ఉత్పత్తుల ద్వారా లాభాలు పొందడం, ఔత్సాహికులైన రైతులు, యువతను ఈ రంగం వైపు ప్రోత్సహించడం కోసం ఈ సదస్సు దోహదపడు